క్లుప్తంగా

వామనావతారంలో జనార్దన స్వామి


జనార్దన స్వామికి వామనావతారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం భూ, నీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం తిరుప్పావై సేవా కాలం నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. రాత్రి స్వామివారికి వామనావతార అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

బీటీఏ డైరీ విడుదల


బీటీఏ డైరీ విడుదలచేసిన కలెక్టర్ వెంకటేష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) 2023వ సంవత్సరపు డైరీని శుక్రవారం జిల్లా కలెక్టర్ వే.ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లిపో మనోజ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి డి.సునీత, ఏలూరు జిల్లా అధ్యక్షుడు సాయిరాజు బల్లం, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిమెల్లి వెంకటేశ్వరరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీహెచ ధర్మలింగం, ఆర్గనైజింగ్ సెక్రటరి ఎ.సాయిరాజు, జిల్లా మహిళా కార్యదర్శి వి.ధనకాంత, సీహెచ్ విమల, బి.కృపాకరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ఆటల పోటీల కరపత్రం విడుదల

ఏలూరు (టూటౌన్): యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడంతో పాటు సంక్రాంతి సంప్రదాయాలకు అనుగుణంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.శివశంకర్ తెలిపారు. డీవైఎఫ్ఐ, విద్య, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ పోటీలను సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల కరపత్రాన్ని స్థానిక పవరుపేటలోని సంఘ కార్యాలయంలో శివశంకర్ విడుదల చేశారు. ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.వెంకటరమణ, లెనిన్ పాల్గొన్నారు.

పేదలకు కొండంత అండ సీఎం జగన్

ఎమ్మెల్యే ఆళ్ల నాని


42వ డివిజన్‌లో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్ : రాష్ట్రంలో పేదలకు కొండంత అండగా ఉంటూ, ప్రతి ఇంటిలో సంక్షేమాల పంటలు పండించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 67వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నగరంలోని 42వ రోజు డివిజన్‌లో 17వ సచివాలయం పరిధి కొత్తపేటలో ఎమ్మెల్యే నాని పాదయాత్రగా వెళ్లి ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాలు ఏ విధంగా అమలు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. డివిజన్ కార్పొరేటర్ అర్జి సత్యవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు అర్జి సత్యవతి ఆధ్వర్యంలో మంగళహారతులు, గజమాలలతో ఘన స్వాగతం పలికారు. గాంధీనగర్, కొత్తపేటలోని గౌరీదేవి ప్రాంతాల్లో నాని పర్యటించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ప్రతీ ఇంటిలోనూ లబ్ధి చేకూర్చుతూ మేలు చేస్తున్నారని వివరించారు. పేదలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకనుక, జగనన్న విద్యా దీవెన, విదేశీ విద్యకానుక, ఫీజు రీయింబర్స్ మెంట్, వైఎస్సార్ చేయూత, ఆసరా ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. పేదలకు మంచి చేయాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం కుటిల రాజకీయాలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు, డైరెక్టర్లు కోరాడ బాబు, మేతర సురేష్, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్లు నున్న స్వాతి శ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, జనపరెడ్డి రాజేశ్వరి, ఈదుపల్లి కల్యాణి, సుంకర చంద్రశేఖర్, పాలిమేర దాసు, కలవకొల్లు సాంబ, జయకర్, లీగల్ సెల్ ఆచంట వెంకటేశ్వరరావు, ప్రత్తిపాటి తంబి, చేనేత సొసైటీ చైర్మన్ కొల్లిపాక సురేష్, ఏలూరు కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ సెక్రటరీ సంపంగి జగదీష్, నాయకులు పొలిమేర హరికృష్ణ, నున్న కిషోర్, కొల్లి నాగేశ్వరరావు, నల్ల ప్రసాద్, బండారు కిరణ్, జిజ్జువరపు రమేష్, కిలాడి దుర్గారావు, తోట సుధీర్, మట్టా రాజు, నిడికొండ నరేంద్ర, యల్లాపు మోజెస్, వైఎస్‌పీ శివరావు, లూటుకుర్తి సుభాష్, పిట్టా ధనుంజయ్, అమీనా అన్సారీ, పార్వతి, గారపాటి వీరస్వామి తదితరులు ఉన్నారు.

చెరువులకు లీజులు నిర్ధారించాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని రజక వృత్తి చెరువులకు లీజులు నిర్ధారించి వాటిని పంచాయతీలు కట్టించుకోవడం ద్వారా రజకులకు న్యాయం చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీలుగుమిల్లి మండలం పి.రాజవరం గ్రామంలో 20 రజక కుటుంబాలకు 1974లో మామిడి గుండం 3.89 ఎకరాల చెరువుని నాటి పంచాయతీ పాలక వర్గం కేటాయించిందన్నారు. ఇప్పటి వరకు ఆ చెరువుకు లీజు ప్రతిపాదనలు తయారు చేయకపోవడం వల్ల రజకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విషయం జీలుగుమిల్లి ఈవోపీఆర్డీకి తెలియజేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జీలుగుమిల్లి రజక సంఘం అధ్యక్షులు మడిచర్ల కనక అబ్బులు, రజకులు మోటేపల్లి లక్ష్మీనారాయణ, అన్నవరపు రామారావు, మాధవరావు కృష్ణ,మడిచర్ల సాయి, కొండపల్లి శ్రీను, మడిచర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదం దేశానికి ప్రమాదకరం

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు


వర్థంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఏలూరు (టూటౌన్) : మతతత్వం – మతోన్మాదం దేశానికి ప్రమాదకరమని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక వాదం పరిరక్షణ కోసం యువత అభ్యుదయ వాదులు నడుం బిగించాలని ఆయన పిలుపు నిచ్చారు. స్థానిక పవరుపేటలోని ఉద్దరాజు రామం భవనంలో స్వాతంత్ర్య సమరయోధుడు, వ్యవసాయ కార్మిక జిల్లా ఉద్యమ నిర్మాత అన్నే వెంకటేశ్వరరావు 20వ వర్ధంతి సభ, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం 4వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. తొలుత వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు లౌకిక వాదం – నేటి సవాళ్లు అనే అంశంపై మాట్లాడారు. దేశంలో ఉన్న భిన్నత్వం ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. రాజ్యాంగం భిన్నత్వంలో ఏకత్వం సాధించి దేశ ప్రజలను ఐక్యంగా ఉంచిందని వివరించారు. మతం వ్యక్తిగతమని, రాజ్యాంగం ప్రజలకు మత స్వేచ్ఛ ఇచ్చిందని చెప్పారు. రాజ్యాంగ మూల సూత్రాలకు విఘాతం కలిగిస్తూ మతాన్ని రాజకీయాల్లోకి లాగారని విమర్శించారు. దేశ లైకికవాదం పరిరక్షణ కోసం మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా మత సామరస్యం కోసం అందరూ నడుం బిగించాలని పిలుపు నిచ్చారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్ విధానాల పేరుతో దేశ సంపదను కొల్లగొడుతున్నారని విమర్శించారు. విద్య, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా వివిధ కళాశాలల్లో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, నాయకులు గుత్తికొండ కృష్ణారావు, బి.సోమయ్య, పి.కిషోర్, గండి రాజా, న్యాయవాదులు ఎ.శివన్నారాయణ, ఎస్ఎన్ కట్టా పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం


క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే నాని, ఎస్ఈ సాల్మన్‌రాజు

ఏలూరు టౌన్ : పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న ఇళ్ల కాలనీలను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారని, ఏలూరు నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించే ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని చెప్పారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబుతో కలిసి విద్యుత్ శాఖ 2023 ఏడాది నూతన క్యాలెండర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ నాణ్యతమైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీ.శశిధర్, ఏలూరు టౌన్ డీఈఈ బీవీ కృష్ణ రాజా, రూరల్ డిప్యూటీ ఈఈ ఇంకార్, ఏఈలు, విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.

హిందూ దేవుళ్లను దూషించిన రాజేష్‌పై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): హిందూ దేవుళ్లను అసభ్య పదజాలంతో దూషించిన తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా ముత్కల్ మండలం రేంజర్ల గ్రామానికి చెందిన రాజేష్‌పై విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గతేడాది డిసెంబరులో నిర్వహించిన పలు సభలు, సమావేశాల్లో హిందూ దేవుళ్లను ఇష్టాను సారంగా తిట్టడం, వ్యంగ్యంగా మాట్లాడటం చేసిన రాజేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి జి.నాగరాజు, బీజేపీ సెంట్రల్ మండల కమిటీ అధ్యక్షుడు బాడిత నారాయణ రావు, నాయకులు సత్యనారాయణ, నెక్కంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాదేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం మాదేపల్లిలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.ప్రణవి తెలిపారు. లబ్ధిదారులను కలిసి సంక్షేమ పథకాలను వివరని, మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేస్తారని పేర్కొన్నారు.

శ్రీవారికి నవనీత అలంకరణ


వెన్న అలంకరణలో శ్రీవారు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి నవనీత అలంకరణ చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ చేసి స్వామి వారి నిత్య హోమాలు, నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. సాయంత్రం 5 గంటలకు నగరానికి చెందిన మైలవరపు లక్ష్మీ నరసింహం యోగ వాశిష్టము అనే అంశంపై ప్రవచనం చేశారు. అనంతరం శ్రీనివాస మంగాపురం వశిష్ఠాశమ లలితా పీఠాధిపతి స్వరూపానందగిరి స్వామి శంకరాచార్య విరచిత సాధన పంచకం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7.30 గంటలకు నగరానికి చెందిన కె.స్వర్ణలత బృందం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఆంధ్ర రవి శంకర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పెట్రోల్ బంకులపై కేసుల నమోదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : తూనికలు, కొలతల శాఖ కంట్రోలర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పలు పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించినట్లు ఆ శాఖ జిల్లా అధికారులు తెలిపారు. ఈ రెండు జిల్లాల్లో కలిపి 14 బృందాలు 67 పెట్రోల్ బంకుల్లో విస్తృతంగా తనిఖీలు చేశాయన్నారు. కొలతల్లో తేడాలు గుర్తించిన 7 బంకులపై కేసులు నమోదు చేసినట్టు స్పష్టం చేశారు.

ధాన్యం రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): మాండస్ తుఫాన్ ప్రభావంతో ధాన్యం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం కొనుగోళ్లల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభాకర్ కోరారు.

మల్కాపురం ఇన్‌చార్జి కార్యదర్శిగా సుమలత

ఏలూరు రూరల్: ఏలూరు మండలం మల్కాపురం ఇన్‌చార్జి కార్యదర్శిగా సుమలతను నియమించినట్టు ఈఓపీఆర్డీ ఎం.సరళకుమారి తెలిపారు. ఇప్పటికే ఆమె మాదేపల్లి పూర్తి స్థాయి కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన రవీంద్రకు చాటపర్రు ఇన్‌చార్జి కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు చెప్పారు. ఆయన పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, కోటేశ్వరదుర్గాపురం కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారని తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ రంగ కార్మికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మరింత అభివృద్ధి చెందాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం భవన నిర్మాణ రంగ కార్మికులు, యూనియన్ నాయకులతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందించే ఉచిత లీగల్ సర్వీసులను వివరించారు. ఫిబ్రవరి 11న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీయోగ్యమైన క్రిమినల్, చెక్ బౌన్స్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు కేసులు, సివిల్ కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ పి.వెంకటేశ్వర రావు, అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ నరసింహ స్వామి గురువారం తెలిపారు. వెంకటకృష్ణాపురంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి, జి.కొత్తపల్లి లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ వరకు నూతనంగా 33 కేవీ ఫీడర్‌ను వేస్తున్నట్టు తెలిపారు.

నలుగురి అరెస్ట్


నలుగుర్ని అరెస్టు చేసిన ఎస్ఈబీ అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరు మండలం పోణంగి గ్రామంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఈబీ పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్ పోణంగిలో పేకాట శిబిరంపై తన సిబ్బందితో దాడి చేశారు. నలుగుర్ని అరెస్టు చేసి, రూ.4,050 స్వాధీనం చేసుకున్నారు. వారిని ఏలూరు రూరల్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని రూరల్ పోలీసులకు సూచించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం

వేలేరుపాడు: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, కుక్కునూరు సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడి పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

జీఎస్టీ చట్టంపై అవగాహన అవసరం


క్యాలెండర్ విడుదల చేస్తున్న స్టేట్ టాక్స్ జాయింట్ కమిషనర్ నాగేంద్రకుమార్ తదితరులు

ఏలూరు(మెట్రో): కమర్షియల్ టాక్స్ అధికారులు జీఎస్టీ చట్టంపై అవగాహన పెంచుకుని సమర్థవంతంగా పనిచేయాలని ఏలూరు డివిజన్ స్టేట్ టాక్స్ జాయింట్ కమిషనర్ కె.నాగేంద్రకుమార్ సూచించారు. ఏలూరులో శుక్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. విధి నిర్వహణలో ఆటంకాలుంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. పదోన్నతులు పారదర్శకంగా జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం యూనియన్ సభ్యులు ఏలూరు డివిజన్ స్టేట్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ కె.రామబాబు, ఏ లూరు–2 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ ధనేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి క్యాలెండర్ అందజేశారు. ఏలూరు డివిజన్ ప్రెసిడెంట్ బీవీ బాబు, సెక్రెటరీ పి.రాజేష్‌బాబు, రాష్ట్ర సెక్రెటరీ జి.ఇందిరమ్మ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జి.రవిప్రసాద్, జి.సతీష్, కె.ప్రశాంత్, వైఎం వీణ, సీహెచ్ మల్లేశ్వరి, జి.డెల్ఫిన్, కె.ప్రసాద్, ఐ.సునీల్, ఎస్.అజయ్‌సింగ్, ఎంపి సామసన్‌రాజు, అద్దంకి సుభాష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పోలిశెట్టి పోరాటం స్ఫూర్తి


పోలిశెట్టి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాతగా ఎస్ఆర్ పోలిశెట్టికి ప్రత్యేక గుర్తింపు ఉందని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా యూటీఎఫ్ వ్యవస్థాపకులు ఎస్ఆర్ పోలిశెట్టి 2వ వర్ధంతి సభ స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సాబ్జీ మాట్లాడుతూ జిల్లాలో యూటీఎఫ్‌ను స్థాపించి 25 సంవత్సరాల పాటు సంఘాన్ని నిర్మించడంలో, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం సాగించిన ఉద్యమాల్లో ఎస్ఆర్ పోలిశెట్టి కీలకమైన పాత్ర పోషించారన్నారు. తొలుత పోలిశెట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి ఎస్‌కే ముస్తఫా అలీ, బి.సుభాషిణి, టి.ఎడ్వర్డ్, పీవీ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	42	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	52	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	22	ములక్కాడలు	12–15
బెండకాయలు	54	కంద	32
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	40
కాకర కాయలు	34–40	కీరా దోస	50
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	36	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	06
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	36	బఠాణి	60
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24–30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	29
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	31
ఏలూరు –తిరుపతి	16.00	4830	34
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	29
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	33